
హక్కు

# అసైన్డ్ భూములు స్వాధీనం చేసుకొని తిరిగి లబ్ధిదార్లకు అప్పగించాలి



- కె. బాలగోపాల్

**వై.ఎస్., చంద్రబాబు, సంఘీ, రామోజీరావు తదితరుల భూ కుంభకోణాలు వెలుగు చూస్తున్న నేపథ్యంలో ఈ విషయాలతో పాటు సీలింగ్ చట్టాల తీరుతెన్నులూ, 9/77 చట్టసవరణ, దేవాలయభూములు పేదలకు పంపిణీ తదితర అంశాలను మానవహక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. బాలగోపాల్‌తో 'మనభూమి' ప్రస్తావించింది. ఆయన అభిప్రాయాలు వ్యాసరూపంలో దిగువున ఇస్తున్నాం.**

కడప జిల్లాలోని ఇడుపుల పాయంలో వై.ఎస్. ఎస్టేటులో ఉన్న భూములు ప్రభుత్వ భూములనీ గతంలో పేదలకు అసైన్ చేసినవనీ చాలాకాలంగా అందరికీ కడపలో తెలిసిన వాస్తవమే. వై.ఎస్. ఆ సంగతి ఆయనకు తెలియనిదని చెప్పడం ఎవ్వరూ నమ్మలేని వాస్తవమే. గతంలో మేము ఫ్యాక్షనిజం గురించి ఆయనను ఇంటర్వ్యూ చేసినపుడు, "బాంబులు ఎట్లా ఉంటాయో నేనెప్పుడూ చూడలేదు" అని అన్నట్లుగానే ఇప్పుడు అవి అసైన్డ్ భూములని తనకు తెలియదని చెప్పగలిగారు. తన ప్రత్యర్థులను ముఖ్యంగా రామోజీరావుని ఇబ్బంది పెట్టడానికి వై.ఎస్. ఈ పన్నాగం పన్నాడని దాదాపు అందరూ అనుకుంటున్న విషయం. వై.ఎస్. ఆక్రమించుకున్న భూముల్లో తోటలు మాత్రమే ఉన్నాయి. అవిపోతే ఆయనకు వచ్చేనష్టం పెద్దగా ఏమీ లేదు. రామోజీ ఆక్రమించిన భూముల్లో ఫిలింసిటీ ఉంది. కాబట్టి అది ప్రభుత్వం తీసుకుంటే రామోజీ చాలా నష్టపోయారు. అందరూ కబ్జాదార్లు అయినపుడు ప్రత్యేకించి ఒకర్ని వెనకేసుకుని రావాల్సిన అవసరంలేదు. "రామోజీరావుపై దాడిని పత్రికా స్వేచ్ఛపై దాడి"గా పేర్కొన్న వలసిన అవసరంలేదు. రామోజీని వెనకేసుకొని రావటం వల్ల "హిందూ" లాంటి పత్రిక తన విశ్వసనీయతను కోల్పోతుంది.

చంద్రబాబు విషయానికొస్తే ఆయనకు చిత్తూరు, నెల్లూరు, జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో చాలా భూములున్న విషయం అందరికీ తెలిసిన విషయమే. ఒక్క చిత్తూరు జిల్లాలోనే 1700 ఎకరాల భూమి ఉందని ఆ జిల్లాలో మామూలుగానే అనుకుంటున్న విషయం. వై.ఎస్. భూముల్లాగే ఈ భూములు కూడా అతని పేరు మీద ఉండవు. ఏ ఒక్కరి పేరున ఉండవు. సీలింగ్ చట్టం నుండి తప్పించుకోవడానికి అవసరమైన ఏర్పాట్లన్నీ జరిగే వుంటాయి. ఈ నేపథ్యంలో "వై.ఎస్." తన దురాక్రమణలో ఉన్న భూములను బయట పెట్టడం ఆదర్శమా? గొప్పదనమా? లేదా ఇతరుల భూములను వెలికి తీయడానికి దీన్ని ఒక మార్గంగా ఎంచుకోవడం నీచత్వమా?" అనే చర్చలోకి పోవడం పూర్తిగా అవసరం. వాస్తవం ఏమిటంటే భూమిలేని పేదలకు అసైన్డ్‌మెంటు ఇచ్చిన సీలింగు భూములు, పెద్ద మొత్తంలో అన్యాక్రాంతమయ్యాయి. వాటిని అనుభవిస్తున్న వారిలో వై.ఎస్, చంద్రబాబు, గిరీష్‌సంఘీ, రామోజీలాంటి వాళ్ళతో మొదలు పెట్టి గ్రామాల్లో బలవంతులైన రైతులు ... చాలా మంది ఉన్నారు. ఎసైన్‌మెంటు విధానంలో ఉండే ముఖ్యమైన లోపం ఏమిటంటే ఎసైన్డ్ చేసిన భూములను బాగుచేసుకుని సాగుచేసుకోవడానికి లబ్ధిదార్లకు ఇచ్చేటటువంటి వ్యవస్థ ఏమీ లేదు. బంజరుభూములు ఎలాగూ సాగుయోగ్యంగా ఉండవు. సీలింగుకోసం భూసారములు అప్పగించిన భూములు కూడా చాలావరకు సాగుయోగ్యం కానివే. దాన్ని సాగుచేసుకోవడానికి వనరులు కల్పించకుండా "డి" పట్టాలు ఇచ్చేసి మూడు సంవత్సరాలు లోపుదాన్ని సాగులోకి తేవకపోతే పట్టారద్దవుతుందని ప్రభుత్వం బెదిరిస్తుంది. అదీ సాధ్యం కాని లబ్ధిదార్లు కొంత డబ్బు తీసుకొని ఆ భూమిని అన్యాక్రాంతం చేయడం జరుగుతుంది. ఇవికాక దౌర్జన్యంగా ఆక్రమించుకుంటున్న ఘటనలూ ఎలాగూ ఉండనే ఉన్నాయి. చాలా సందర్భాల్లో పట్టాలు ఇస్తారుగానీ ఆ భూమి ఎక్కడుందో చూపించరు. గట్టుపెట్టి సరిహద్దులు చూపించి అప్పగించరు. ఆ విధంగా కూడా భూములు అన్యాక్రాంతమౌతున్నాయి. ఇప్పుడు ప్రజాతంత్ర శక్తులు, మీడియా ప్రచారం చేస్తున్న కృత్రిమ వివాదంలోకి పోకుండా ప్రభుత్వం ముందు ఒకే ఒక డిమాండు పెట్టాలి. "డి-ఫారమ్" పట్టాలిచ్చిన భూములు రికార్డు ప్రతీ మండల కార్యాలయంలోనూ తప్పనిసరిగా ఉంటుంది. ఆ రికార్డు మొత్తం బయటకు తీసి ప్రతీ పట్టా గురించి విచారణ జరిపి అది అన్యాక్రాంతమైందా? లేదా? అని చూసి అన్యాక్రాంతమై ఉంటే దాన్ని స్వాధీనం చేసుకొని లబ్ధిదారులకు తిరిగి వెనక్కి ఇప్పించాలి. రాష్ట్ర వ్యాపితంగా ఈ పనిని ప్రతీ మండలంలోని గ్రామాల్లో ఈ విధంగా చెయ్యాలని డిమాండ్ పెడితే హర్హులైన లబ్దిదార్లకు భూములు దక్కుతాయి.

9/77 చట్టానికి చేసిన సవరణ నష్టకరమైనది. ఎందుకంటే పైన పేర్కొన్న

డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించి అన్యాక్రాంతం అయిన ఎసైన్డ్ భూములు గురించి విచారణ జరిపి వాటన్నింటినీ స్వాధీనం చేసుకున్నా ఈ సవరణ ప్రకారం ప్రభుత్వం ఆ భూమిని తిరిగి లబ్ధిదారులకు ఇవ్వకుండా తన దగ్గర పెట్టుకొని ఏ కంపెనీకో, ఏ ఎస్ఇజెడ్ కో అప్పగించవచ్చు. ఈ చట్ట సవరణ జరిగితే పేదలకు చాలా నష్టం జరుగుతుంది. భూ పంపిణీ రెండు రకాలు 1. భూ గరిష్ట పరిమితి చట్టాల క్రింద భూస్వాముల మిగుల భూములను పంచడం. ప్రభుత్వ బంజరుభూములను పంచడం సీలింగ్ చట్టాలు చాలావరకు విఫలం అయ్యాయి.ఒక పశ్చిమబెంగాల్‌లో తప్ప అన్ని రాష్ట్రాల్లోనూ విఫలమయ్యాయనేది వాస్తవం. సాగు యోగ్య భూముల్లో 2 శాతం మాత్రమే మిగులు భూమిగా గుర్తించబడింది. అది కూడా మొత్తం పంచలేదు. పంచినది కూడా తిరిగి అన్యాక్రాంతమైనది. బంజరు భూములు పంపకంగా జరిగింది గానీ ఆ భూములు సాగు యోగ్యం చేయడానికి అవసరమైన ఆర్థిక వనరులను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం మూలంగా దానివల్ల రాదగినంత ప్రయోజనం రాలేదు. ప్రభుత్వం దేశవ్యాపితంగా అమలు చేస్తున్న "గ్రామీణ ఉపాధి హామీ పథకం" కింద చేపట్టగల పనుల్లో అసైన్డ్‌భూములను బాగుచేసేపనిని చేర్చారు. దానికే మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలి అనే ఆంక్ష ప్రభుత్వం పెట్టినట్లయితే బంజరు భూముల్లో ఇచ్చిన 'డి'-ఫారమ్ పట్టాదార్లలకు కొంతమేరకైనా న్యాయం జరుగుతుంది.

దేవాలయ భూములు 3 లక్షల ఎకరాలకు పైగా రాష్ట్రంలో ఉన్నాయనేది అంచనా. దీనికి సంబంధించి కొన్ని ప్రతిపాదనలు కొన్ని సంఘాలు చాలాకాలంగా పెడుతున్నాయి. మొత్తంగా ఈ భూములన్నింటినీ దేవాలయశాఖనుండి కొనుగోలు చేసి ఆ డబ్బును దేవాలయఖాతాల్లో జమ చేసి భూమిలేని పేదలకు ముఖ్యంగా దళితులకు ఈ భూములను అసైన్డ్ చేయవచ్చు. ఇవి చట్టరీత్యా చెల్లుతుంది. ఎందుకంటే "తగు మొత్తంలో నష్టపరిహారం ఇచ్చిన పక్షంలో దేవాలయ భూములను కూడా భూసేకరణ చట్టం క్రింద స్వాధీనం చేసుకోవచ్చు" అని 1950లోనే సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. అయితే దీన్ని హిందూమతంపై దాడిగా చిత్రీకరించి గగ్గోలు పెడతారు కాబట్టి దీనికి ప్రత్యామ్నాయంగా దేవాలయ భూములను కౌలుకిచ్చినపుడు వేలంపాట పెట్టకుండా ఆ గ్రామంలోని భూమిలేని నిరుపేదలకు, ప్రధానంగా దళితులకు ప్రభుత్వం నిర్ణయించిన న్యాయబద్ధమైన రేటుకు అప్పగించడానికి చట్ట సవరణ చేయాల్సిన అవసరం ఉంది. అటువంటి సవరణ కూడా రాజ్యాంగబద్ధమే అవుతుంది. కనీసం ఈ పనైనా చేయాలనే డిమాండ్ పెట్టడం సబువుగా ఉంటుంది.

❖

